క్లుప్తంగా

గురుదక్షిణామూర్తికి పూజలు


విశేషాలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. విశేషాలంకరణలో ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు.

చట్టాలతో రక్షణ


మాట్లాడుతున్న న్యాయవాది ప్రజ్ఞశ్రీ

శ్రీకాళహస్తి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది ప్రజ్ఞశ్రీ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలు, పిల్లల సంరక్షణ చట్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలు, పిల్లల సంరక్షణ చట్టాలు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. సమాజం పట్ల విద్యార్థులు బాధ్యతగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నీరజ, శైలజ, దీనదయాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


మాట్లాడుతున్న నోడల్ అధికారి సురేష్ బాబు

ఏర్పేడు: మహిళలు ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చని డీసీసీ బ్యాంకు నోడల్ అధికారి సురేష్ బాబు నాయుడు అన్నారు. గురువారం మండలంలోని నాగంపల్లి సమీపంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థిక లావాదేవీలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బడ్జెట్, పొదుపు స్మార్ట్ ఫైనాన్షియల్ ప్లానింగ్, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు మేనేజరు తేజస్విని, ఫీల్డ్ అధికారి రమేష్, ఎస్ఓఎస్ కుటుంబ బలోపేత లొకేషన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, మునిరత్నం, మహిళలు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి వైద్య పరీక్షలు


కళ్లను పరీక్షిస్తున్న డాక్టర్ రాజేష్

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో తిరుపతి అమెరికన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎండీపుత్తూరు, మిట్టఇండ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల నుంచి వచ్చిన 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కేటీరోడ్డులో గురువారం ఓ కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లడంతో ఇద్దరికి స్వల్ప గాయాలైన ఘటన వెలుగు చూసింది. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం అరంబాకం టౌన్‌కు చెందిన డ్రైవరుతో పాటు ఇద్దరు శ్రీకాళహస్తికి వెళ్తుండగా అరిగిలకండ్రిగ వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారులోని ఇద్దరు స్వల్పంగా గాయపడగా, డ్రైవరుకు ఎలాంటి గాయాలు కాలేదు.

నేటి నుంచి పశుగణన

నారాయణవనం: మండలంలో శుక్రవారం నుంచి పశుగణన నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారులు భార్గవి, కుమార్ తెలిపారు. మీడియాతో వారు మాట్లాడుతూ ప్రతి 5 ఏళ్లకు ఒక్కసారి పశుసంవర్ధక, మత్స్యశాఖలు సమన్వయంతో గణన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఇందులో మండలవ్యాప్తంగా పశువులు, బర్రెలు, కోళ్లు, మేకలు, గొర్రెలు, బాతులు, పెంపుడు కుక్కలు, పందుల వివరాలను క్షేత్రస్థాయి సిబ్బందికి పాడి రైతులు తెలియజేయాలని వారు కోరారు.

నాడు గొప్పలు.. నేడు తిప్పలు

- డిప్యూటీ సీఎం ఆదేశాలు బేఖాతరు
- కానరాని సూళ్లూరుపేట రోడ్డు అభివృద్ధి
- ప్రగల్భాలకే పరిమితమైన పవన్ వ్యాఖ్యలు


సీసీఎల్ ఫ్యాక్టరీ వద్ద అధ్వానంగా రోడ్డు


సంతవేలూరు వద్ద గుంతలమయంగా రహదారి


గాజులపెళ్లూరు వద్ద దెబ్బతిన్న రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ : షార్‌లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు మన కోసం వారి జీవితాలు త్యాగం చేస్తున్నారని వారి కోసం బీఎన్‌కండ్రిగ, సూళ్లూరుపేట రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, గుంతలు లేని రోడ్డుగా తీర్చిదిద్దాలని కలెక్టరు వెంకటేశ్వర్లును రాష్ట్ర డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ శ్రీహరికోటలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఆదేశించారు. ఆ మేరకు మరమ్మతుల్లో భాగంగా రోడ్డుకు అక్కడక్కడా కంకర, మట్టితో తూతూ మంత్రంగా గుంతలు పూడ్చి చేతులు దులుపుకున్నారు. ఆయన ఆదేశించి మూడు నెలలు అవుతున్నా నేటికి శాశ్వతంగా రోడ్డు అభివృద్ధి గురించి ఆలోచన చేయకపోవటంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

తుపాన్ నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు నిలిచి గుంతలమయమై అధ్వానంగా తయారైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుచ్చినాయుడుకండ్రిగ నుంచి సూళ్లూరుపేట ఆర్ అండ్‌బీ రోడ్డు పెరిటిపాడు గ్రామం వరకు 14 కిలో మీటర్ల మేర ఉంది. రోజుకు రోడ్డుపై 700 నుంచి 900 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బెంగళూరు నుంచి శ్రీహరికోటకు వచ్చే శాస్త్రవేత్తలు ఈ రోడ్డు నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అదేవిధంగా తిరుపతి, శ్రీకాళహస్తి నుంచి సూళ్లూరుపేటకు ఇదే మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు వెంట మతకాముడి, గాజులపెళ్లూరు, ఉగ్గుమూడి, ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీ, సాధనవారిపాళెం, సంతవేలూరు, సీసీఎల్ కర్మాగారం ఉన్నాయి. వీరంతా అధ్వానంగా ఉన్న ఇదే రోడ్డు మీద నుంచి రాకపోకలు సాగించాల్సి రావడంతో అష్టకష్టాలు పడుతున్నారు. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి ఏది గుంతో.. ఏది లేదో తెలియక వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా వాహనదారులు రాత్రి వేళల్లో గుంతలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాహనాదారులు వాపోతున్నారు.

పవన్ చెప్పినా అభివృద్ధికి నోచుకోలేదు

బీఎన్‌కండ్రిగ, సూళ్లూరుపేట ప్రధాన రహదారి అభివృద్ధి గురించి సాక్షాత్తు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తక్షణమే రోడ్డును అభివృద్ధి చేయాలని ఆదేశించినా అమలు కాలేదు. డిప్యూటీ సీఎం ఆదేశాలకే దిక్కులేకపోతే ఇక మిగతా వాటి గురించి పట్టించుకొనే వారే లేరు.

- రమణయ్య, గాజులపెళ్లూరు

ప్రమాదాలు జరుగుతున్నాయి

బీఎన్‌కండ్రిగ, సూళ్లూరుపేట రోడ్డు మార్గంలో వాహన చోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు గుల్లవుతున్నాయి. రోడ్లు ఇంత అధ్వానంగా ఉన్నా ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణం.

- మునికృష్ణారెడ్డి, మతకాముడి.

ప్రజల కష్టాలను పట్టించుకుంటారనుకుంటే..

- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు
- జూనియర్ కళాశాలలో బాణసంచా దుకాణాలను పెడితే ధ్వంసం చేస్తాం
- విద్యార్థి సంఘాల ఫైర్


నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

శ్రీకాళహస్తి: స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రజల కష్టాలను పట్టించుకుంటారని భావిస్తే, ఆయన కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఆశ్చర్యకరమని, పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే ధ్వంసం చేయడానికి వెనుకాడమని విద్యార్థి సంఘాలు నాయకులు హెచ్చరించారు. గురువారం వారు పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుందని, కళాశాల సమీపంలోనే అన్న క్యాంటీన్, 150 పడకల ప్రభుత్వాస్పత్రి, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, బస్టాండ్ ఇతరత్రా ఉన్నాయన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ట్రాఫిక్ అంతరాయం కూడా కలుగుతుందని, తాము ఇక్కడ అనుమతులు ఇవ్వవద్దని, పట్టణంలోని ఎస్వీయూ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో అనుమతులు ఇవ్వాలని వినతులు ఇచ్చినా అధికారులు పెడచెవిన పెట్టారన్నారు. ఇక్కడ అనుమతులు ఇస్తే ధ్వంసం చేయడానికి కూడా వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో కోగిలి మునిచందు, అభి, జాకీర్, విష్ణుకాంత్, అబ్దుల్ కలాం, మునిగోవిందు, గురవయ్య, రిజ్వాన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలకు జనం బారులు


ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరిన ప్రజలు


సత్యవేడులో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వరదయ్యపాళెం(బుచ్చినాయుడుకండ్రిగ): బుచ్చినాయుడుకండ్రిగ మండలకేంద్రంలో గ్రామ సచివాలయాల్లో గురువారం నిర్వహించిన ఆధార్ క్యాంపులకు ప్రజలు బారులు తీరారు. ఆధార్ నమోదు కేంద్రంలో సిబ్బంది 43 మంది చిన్న పిల్లలకు ఆధార్ నమోదు, పేరు మార్పు, ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్, చిరునామా, ఫోన్ నంబర్లు మార్పులు వంటి సేవలు అందించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆధార్ సేవల క్యాంపు శుక్రవారం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని సచివాలయం-4లో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని గురువారం ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య లేకుండా ఆధార్ నమోదు సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు బయోమెట్రిక్, చిరునామా, పుట్టిన తేదీ, పేర్లు మార్పులు చేస్తున్నట్లు డిజిటల్ అసిస్టెంట్ ప్రకాష్ తెలిపారు.

ముక్కంటి సేవలో దిల్ రాజు


ఆలయం వెలుపల దిల్ రాజు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న మధుసూదన్

రేణిగుంట: కరకంబాడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రేణిగుంట పోలీసులు తెలిపిన వివరాలు.. రేణిగుంట మండలం గురవరాజుపల్లి పంచాయతీ రామకృష్ణాపురానికి చెందిన నరసింహులు కుమారుడు మధుసూదన్(39) రేణిగుంటలో ఓ న్యూస్ చానెల్‌లో రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా కరకంబాడికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మధుసూదన్ తలకు గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్బీకే తెరవరా..!


మరదవాడలో మూతపడిన రైతు భరోసా కేంద్రం

వరదయ్యపాళెం: గ్రామాల్లోనే రైతులకు సేవలందించే ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. గురువారం వరదయ్యపాళెం మండలంలోని మరదవాడ రైతు భరోసా కేంద్రానికి వ్యవసాయశాఖ సిబ్బంది హాజరు కాకపోవడంతో మూతపడింది. దీంతో ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతుల అవసరాల కోసం రైతు భరోసా కేంద్రానికి వెళ్లే రైతులకు సమాధానం చెప్పే నాథుడే కరువయ్యాడు. అంతేకాక మండలవ్యాప్తంగా కూడా ఆర్బీకేల నిర్వహణ మొక్కుబడిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సిబ్బంది అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో అందుకు భిన్నంగా రైతుల అవసరాలను తీర్చకపోవడమే కాకుండా వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామస్థాయిలో ఉండడం లేదని రైతులు వాపోతున్నారు.

స్టేట్ కబడ్డీ జట్టుకు అజయ్


పీడీలతో విద్యార్థి అజయ్

నారాయణవనం: కబడ్డీ అండర్–14 రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి అజయ్ ఎంపికయ్యారు. పాఠశాల పీడీలు సదాశివం, జయప్రకాష్‌లు మాట్లాడుతూ నాగలాపురంలో జరిగిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థి అజయ్ ప్రతిభను కనబరిచి ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టులో స్థానం పొందాడని తెలిపారు. నవంబర్ 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అజయ్ పాల్గొంటున్నట్లు జయప్రకాష్, సదాశివం తెలిపారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్


నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉందని, వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. గురువారం మండలంలోని తహానగర్ గ్రామంలో ఆయన సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలో వృథాగా ఉన్న తొట్టెల్లో నీటిని తొలగించి, తాగునీటి ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడిన తర్వాత దోమలు పెరిగి డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, మెదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అలాగే కలుషిత నీటి వల్ల టైఫాయిడ్, విరేచనాలు వస్తాయన్నారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు, సర్పంచ్ ప్రకాశ్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

28న మండలమీట్

నారాయణవనం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 28వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని ఆయన కోరారు.

దళితులకు ఇళ్లు మంజూరు చేయండి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నాగలాపురం: మండల కేంద్రమైన సుందరయ్య కాలనీలో ఏళ్ల తరబడి నివసిస్తున్న దళిత గిరిజనులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సుందరయ్య కాలనీలో సీపీఎం శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలం లేని పేదలకు సీపీఎం తరఫున గత 15 ఏళ్లుగా అనేక పోరాటాలు చేసి ఇంటి పట్టాలు ఇప్పించామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మురుగేశన్, సభ ప్రతినిధులు, రమేష్, దినమణి, బాలాజి , తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ


మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం భారతి

సత్యవేడు: ప్రభుత్వ పాఠశాలల్లో పచ్చదనం పెంపొందించడానికి శ్రీసిటీ శ్రీకారం చుట్టింది. గురువారం శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 42 రకాలకు చెందిన మొక్కలు సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు అందజేశారని హెచ్‌ఎం భారతి తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి ఆటస్థలం సమీపంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమనకు ఘన సన్మానం


భూమనను సన్మానిస్తున్న సత్యవేడు సమన్వయకర్త రాజేష్

నాగలాపురం: ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డిని సత్యవేడు నియోజకవర్గ సమన్వకర్త నూకతోటి రాజేష్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం ఆయన తిరుపతి పద్మావతిపురంలోని భూమన స్వగృహానికి నియోజకవర్గ నాయకులతో కలిసి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీరేంద్ర వర్మ, భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం


రేణిగుంట : అభయక్షేత్రంలో దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట: రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సతీమణి డాక్టర్ సిపాయి శాంతి 11వ వర్ధంతి సందర్భంగా గురువారం రేణిగుంట సమీపంలోని ఆమె సమాధి వద్ద డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వారి కుటుంబ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన అభయక్షేత్రంలోని 200 మంది దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సిపాయి మాట్లాడుతూ తన సతీమణి విడిచిపెట్టి దశాబ్దకాలం గడిచినా, ఇప్పటికీ మరువలేకున్నామని తెలిపారు. అభయక్షేత్రంలో 200 మంది దివ్యాంగులను కంటికి రెప్పలా కాపాడుతున్న నిర్వాహకురాలు తస్లీమ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సిపాయి కీర్తిసాగర్ రెడ్డి, డాక్టర్ సిపాయి మౌనారెడ్డి, పెరుమాల్ రెడ్డి, డాక్టర్ బాబు, రోజా, దీప తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతన్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగరాజు

రేణిగుంట: సమతుల పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రగతి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.నారాయణ అన్నారు. మండలంలోని చైతన్యపురం, కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉండే కల్తీ లేని కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసులు రోజువారీ భోజనంలో తీసుకుంటే స్థూల, సూక్ష్మ పోషకాలు శరీరానికి అంది ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి వస్తువు కల్తీ అయిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఈ ఆహార నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. దీపావళి ఆస్థానం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు ఆలయ సన్నిధితోపాటు ప్రాంగణంలోని ఇతర ఆలయాల గోడలు, పైకప్పు, పూజాసామగ్రి..ఇత్యాది వాటిని నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు.

సార్..ఫిర్యాదుల బాక్స్ ప్లీజ్!

తిరుపతి అర్బన్: మహిళా ఉద్యోగులకు రక్షణగా ఉండాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం నేతృత్వంలో పలువురు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఉద్యోగినుల సమస్యలను తెలియజేయడానికి ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయడంతో పాటు పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేశారు. ఉద్యోగ సంఘం నేతలు తిరుపతి జిల్లా చైర్మన్ గోపినాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మహిళా విభాగం చైర్ పర్సన్ సంధ్యారాణి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పద్మజ పాల్గొన్నారు.

ఇసుకాసురులే హత్య చేశారు



నిరసన తెలుపుతున్న అంజూరు శ్రీనివాసులు, బాధిత కుటంబ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- రైతు రాజేంద్ర, కొడుకు చైతన్యకు వైఎస్సార్‌సీపీ, వామపక్ష నేతల నివాళి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన సాధారణ రైతు రాజేంద్ర, ఐదేళ్ల కుమారుడు చైతన్యను ఇసుకాసురులే హత్య చేశారని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీచైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం ఆయన గ్రామంలో పర్యటించి మృతులకు నివాళులర్పించారు. పార్టీ తరఫున అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రమని ఇప్పుడు శ్రీకాళహస్తిలో ఇసుకాసురులు ఎక్కువ అయిపోయారన్నారు. డ్రైవింగ్ రాని వారు ఇసుక ట్రాక్టర్లను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే బుధవారం రాత్రి తండ్రీకుమారులు మరణించారని తెలిపారు. ఒక తొట్టంబేడు మండలంలోనే ఆరుగురు మరణించారన్నారు. బుధవారం రోజు వైఎస్సార్‌సీపీ 16వ వార్డు ఇన్‌చార్జ్ ఫాజల్‌పై ఇసుకాసురులు పదిమందితో దాడి చేయాలని చూశారన్నారు. నియోజకవర్గంలో ఇసుక అక్రమంగా తరలిపోతోందని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీకాళహస్తిలో ఇసుకపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. స్థానిక పోలీసు అధికారుల్లో చలనం లేకుండా పోయిందన్నారు. మృతుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జ్ ఉన్నం వాసునాయుడు మాట్లాడుతూ చియ్యవరం గ్రామానికి చెందిన సాధారణ రైతు రాజేంద్ర, ఐదేళ్ల కుమారుడు చైతన్య ఇసుక ట్రాక్టర్ గుద్ది మరణించడం బాధాకరమన్నారు. అందుకు కారణమైన ట్రాక్టర్ యజమానిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వామపక్షాల నాయకులు గురవయ్య, పుల్లయ్య మాట్లాడుతూ స్వర్ణముఖిలో ఇసుక చెన్నైకి తరలిపోతోందని, దీంతో ఇక్కడ ఇసుక దొరకాలంటే కష్టమైందన్నారు. స్థానిక భవన నిర్మాణ కార్మికులు ఇసుక కొరతతో పనిలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాలుగు నెలలుగా ఇసుక తరలిపోతుంటే ఎమ్మెల్యే, పోలీసులు స్పందించడం లేదన్నారు. మృతి చెందిన తండ్రీకొడుకుల కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గురవయ్య, గోపి, పుల్లయ్య, రమణయ్య, నాయకులు బియ్యపు అకర్ష్‌రెడ్డి, సాధన, మున్నారాయల్, సురేష్, ఫజల్, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.